'సింగల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడొద్దు'

- దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు

గండి మైసమ్మలో ఓ హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్, జూన్ 19: సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా దుండిగల్ మునిసిపాలిటీ పరిధిలోని పలు కిరాణా షాపులు, హోటల్స్, చికెన్, మటన్ దుకాణాలపై మున్సిపాలిటీ ప్రత్యేక బృందాలు గురువారం తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా సింగల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను అమ్మేవారికి జరిమానా విధించారు. కాగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల బదులు ప్రజలంతా జూట్ బ్యాగులు, కర్ర సంచులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కే అంజయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చర్లపల్లి చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్

చర్లపల్లి, జూన్ 19 : చర్లపల్లి చెరువును తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ గురువారం సందర్శించారు. చర్లపల్లి చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీటి సరస్సుగా రూపుదిద్దడంలో భాగంగా జైళ్ల శాఖ, హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు చెరువును సందర్శించి చెరువును ఆధునీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువు చుట్టూ పర్యటించి చెరువునీటి ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక విహార కేంద్రంగా తీర్చిదిద్దడంపై వారు ఆయా విభాగాల అధికారులతో కలిసి చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై మాట్లాడారు.

నల్లచెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 19: కూకట్‌పల్లి నల్ల చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా కూకట్‌పల్లి డివిజన్‌లోని నల్లచెరువును అధికారులతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి నల్లచెరువు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్తీల్లో డ్రైనేజీ,రోడ్ల సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాటిని పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూకట్‌పల్లి తన పుట్టిన ఊరు అని, ప్రజలకు ఏ లోటు రాకుండా చూసుకునే బాధ్యత తనపై ఉందన్నారు.

కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, వివిధ కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నల్లచెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

అధికారుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నేడు బాలాజీనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన

బాలాజీనగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలను శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించనున్నట్లు కార్పొరేటర్ పగడాల శిరీషా బాబురావు తెలిపారు. ఉదయం 9 గంటలకు కాముని చెరువు, రంగధాముని చెరువు పరిశీలన, వివే క్‌నగర్‌లో పైపులైన్ పనులను పరిశీలించి ఆ తర్వాత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి

కలెక్టర్ మనూచౌదరికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు
- నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 19: నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాల, పాఠశాలల నిర్మాణ పనుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనూ చౌదరికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాఠశాల, వైద్యశాల నిర్మాణ పనులకు తోడు భూముల క్రమబద్ధీకరణ, నిషేధిత జాబితా నుంచి వాటిని తొలగించాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో వంద పడకల వైద్యశాల, కాలనీ 3వ ఫేజ్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం శంకుస్థాపన జరిగి రెండేళ్లు గడుస్తుందని ఇప్పటికీ స్థల సేకరణ పూర్తికాలేదన్నారు. ఈ స్థలాలను హౌసింగ్ బోర్డు సంస్థ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిర్మాణ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే హైదర్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 145,163లో యాభై ఏళ్ల క్రితం వసంతనగర్, సర్దార్ పటేల్‌నగర్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ లాంటి పలు కాలనీలు వెలిసాయని.. ఇక్కడ జీహెచ్ఎంసీ అనుమతితో వేలాదిగా ఇండ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. అయితే గత కొన్నిరోజులుగా ఆయా కాలనీలలో భవనాలను నిర్మించేందుకు దరఖాస్తు చేసుకుంటే... నిషేధిత భూములుగా పేర్కొంటూ అధిరారులు అనుమతులు నిరాకరిస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. దీనికి తోడు ఇప్పటికే నిర్మించిన భవనాలకు ఎన్ఓసీ ఇవ్వడం లేదని... దీంతో అక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణ చేపట్టాలి..

అల్లాపూర్‌లోని సర్వే నంబర్ 18లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిలో తెలుగు, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని కోరారు. ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్‌లోని అస్మత్‌పేట్ చెరువు కట్టపై డంపింగ్‌యార్డ్ పక్కన ప్రభుత్వ స్థలంలో.. ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖాన లేదా 100 పడకల వైద్యశాలను నిర్మించాలని, చెరువు సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఫతేనగర్ ఇందిరా గాంధీపురంలో భవన యజమానుల స్థలాలను క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. మూసాపేట్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవనంలో అదనపు అంతస్తులు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇండ్లను జీవో నంబర్ 58,59తో క్రమబద్ధీకరణ చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస రావు, పగడాల శిరీష బాబురావు, జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, బాబురావు ఉన్నారు.

ఇజ్రాయెల్ దురాక్రమణను ఆపండి..

- షాపూర్‌నగర్‌లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

దుండిగల్, జూన్ 19: పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయెల్, అమెరికా దురాక్రమణను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో గురువారం షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి పీ. సత్యం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద దేశాలైన ఇజ్రాయిల్ దాని మిత్ర దేశం అమెరికా రెండూ కలిసి పాలస్తీనా, ఇరాన్ దేశాలపై ఏకపక్ష యుద్ధం చేస్తున్నాయన్నారు. సాధారణ ప్రజలు, మహిళలు, పిల్లలను చంపడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. తక్షణం యుద్ధం ఆపి శాంతిని నెలకొల్పాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీపీఐ మండల కార్యదర్శి కే స్వామి, నరసింహారెడ్డి, రమేశ్, కనకయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, లింగస్వామి, సత్యం, స్వాతి, దేవదానం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో రైతు భరోసా అందించాలి

- పీఏసీఎస్ చైర్మన్లు, రైతుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనూచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు

దుండిగల్, జూన్ 19: రైతు భరోసా నిధులను రైతులందరికీ వర్తింపజేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)చైర్మన్లు ఎఫ్ఏసీఎస్ చైర్మన్లు, రైతులతో కలిసి గురువారం కలెక్టర్ మనూచౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేస్తున్నప్పటికీ మేడ్చల్ జిల్లా పరిధిలోని ఏ ఒక్క రైతు అకౌంట్లో నిధులు జమ చేయడం లేదని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో రెండు విడతలు రైతు భరోసా అందించిన ప్రభుత్వం మేడ్చల్ జిల్లాలో ఒక్కసారి కూడా విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రుణమాఫీ సమయంలోనూ కక్షపూరితంగా వ్యవహరించిన ప్రభుత్వం సగం మంది రైతులకు మాత్రమే మాఫీ చేసిందన్నారు. మేడ్చల్ జిల్లాలో ధాన్యం పండించడం లేదా? ఇక్కడ రైతులు లేరా! అని ప్రశ్నించారు. రెండు,మూడు రోజుల్లో రైతులందరికీ రైతు భరోసా డబ్బులు వేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని పీఏసీఎస్ చైర్మన్లు హెచ్చరించారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. బౌరంపేట, శామీర్‌పేట్, డబిల్‌పూర్, మేడ్చల్, కీసర, పూడూరు పీఏసీఎస్ చైర్మన్లు మిద్దెల బాల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఓయూతో అమెరికా వర్సిటీ ఎంవోయూ

ఉస్మానియా యూనివర్సిటీ: అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్'తో ఉస్మానియా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో విద్యార్థుల సమగ్ర వికాసం, శిక్షణా రూపకల్పన, బోధనలో ఓయూ ఎడ్యుకేషన్ విభాగం, యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్‌చైల్డ్ సంస్థ ఇకపై కలిసి పనిచేయనున్నాయి. సర్వస్థాయి (whole school) దృక్పథం ద్వారా సామాజిక, భావోద్వేగ విద్య (Social and Emotional Learning-SEL)ను అందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి సహా ఉమ్మడి పరిశోధనలకు తోడ్పడనుంది.

ఈ మేరకు ఒప్పందంపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నీల్ బూత్ సంతకాలు చేశారు. పలువురు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్ల ఎమ్మెల్యే వివేకానంద్ ప్రత్యేక శ్రద్ధ

బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ జగన్, నాయకులు

జగద్గిరిగుట్ట, జూన్ 19: ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ప్రత్యేక చొరవ చూపుతారని పలువురు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ చెందిన శ్రీనివాస్ తీవ్ర అనారోగ్యం బాధపడుతుండటంతో నాయకులు ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో కార్పొరేటర్ జగన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అశోక్ తదితరులు బాధితుడాకి ఆ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సాజిద్, మహమూద్, పాపుల్ గౌడ్, అజమ్, శ్రీనివాస్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నరేందర్(ఫైల్)

మూసాపేట, జూన్ 19: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట మారుతీనగర్‌కు చెందిన తూము నరేందర్(40) జిమ్ కోచ్. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. దాంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నరేందర్ తన గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అనిత, తండ్రి నరసింహ గమనించి వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్లు పరిశీలించి అప్పటికే నరేందర్ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై కేసు

శేరిలింగంపల్లి, జూన్ 19: సంధ్య కన్వెన్షన్స్ ఎండీ శ్రీధర్‌రావుతోపాటు అతడి అనుచరులు వెంకటేశ్, మరో ముగ్గురిపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల గచ్చిబౌలి లోని ఫెర్టిలైజర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీలో హైడ్రా అధికారులు రోడ్డు మార్కింగ్ నిర్వహిస్తుండగా అక్కడకు చేరుకున్న నటి రమ్యశ్రీ సోదరుడు ప్రశాంత్‌పై శ్రీధర్‌రావు అనుచరులు దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ప్ర శాంత్ గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. అంతేకాకుండా కుషి చంద్ వడ్డే అనే మరో బాధితుడు సైతం శ్రీధర్‌రావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైడ్రా పోలీసుల సమక్షంలోనే అత్యంత వేగంగా కారు నడిపి తనను ఢీకొట్టబోయాడని, తిరిగి వెళ్లిపోతుండగా రోడ్డుపై కేటీఎం వాహనంపై వచ్చి కారుపై రాళ్ల దాడి చేశారని పేర్కొన్నాడు. శ్రీధర్‌రావు, అతడి అనుచరుడైన వెంకటేశ్ ఆదేశాలతోనే తనపై దాడి చేశారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావు నుంచి తనకు ప్రాణహాని ఉందని కుశి చంద్ వడ్డే పేర్కొన్నాడు. పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొంపల్లిలో అక్రమ నిర్మాణాలు..!

- చోద్యం చూస్తున్న అధికారులు

సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల వెనుక అక్రమంగా చేపట్టిన షెడ్డు నిర్మాణం

కుత్బుల్లాపూర్, జూన్ 19: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ షెడ్డు నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా నిర్మాణదారులు విచ్చలవిడిగా భారీ షెడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిపై అధికారుల నిఘా లేకపోవడంతో అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారు. అనుమతుల్లేకుండా చేపట్టిన ఈ నిర్మాణాల వెనుక కొంతమంది అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉన్నదని, ఆ కారణంగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదంటూ విమర్శలు వినవస్తున్నాయి. ఇటీవల కొత్తగా వచ్చిన ఉన్నతాధికారితోపాటు టౌన్ ప్లానింగ్ అధికారి పర్యవేక్షణ లేకపోవడం వెనుక ఆంతర్యమేమిటిని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు జయభేరిలో అనుమతులకు మించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం పట్ల స్థానికుల నుంచి ఫిర్యాదులు వెళ్లినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ బహిర్గంగంగానే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

కింద స్థాయి సిబ్బంది ఈ అక్రమ నిర్మాణాలకు దన్నుగా నిలుస్తున్నారని, దాంతో రోజురోజుకు కొంపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దూలపల్లి ప్రధాన రోడ్డు పక్కన వెలిసిన షెడ్డు

మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు

దుండిగల్,జూన్ 19: ప్రతి కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు,యాదవ సంఘం సభ్యులు గురువారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన వివరిం చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అదే విధంగా పలువురు శుభకార్యాల్లో పాల్గొనాలని ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

సీఎంఆర్ టీపీ అధ్యాపకురాలికి డాక్టరేట్

మేడ్చల్, జూన్ 19: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌కు చెందిన అధ్యాపకురాలు రత్నకుమారికి డాక్టరేట్ లభించింది. మెకానికల్ ఇంజినీరింగ్ థర్మల్ విభాగంలో 'ఇన్వెస్టిగేషన్స్, ఎమిషన్ అండ్ కంబషన్ క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ సీఐ ఇంజిన్ యూసింగ్ లైజ్డో సెల్లులోసిక్ బయో ఫ్యూయెల్స్'పై చేసిన పరిశోధన పత్రాలను జేఎన్‌టీయూహెచ్ ఆమోదించి, పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

దేవరయాంజల్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్, జూన్ 19: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం మేడ్చల్ దేవరయాంజల్‌లో అల్వాల్ ట్రాఫిక్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ మైనర్ బాలలకు ఎట్టి పరిస్థితులో వాహనాలు ఇవ్వరాదని, పట్టుబడితే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజుతోపాటు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'చెత్తను రోడ్ల పక్కన వేయొద్దు'

మల్లాపూర్,జూన్ 19: వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను గురువారం హెచ్‌బీ కాలనీ డివిజన్లో కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌బీకాలనీ ఆనంద్‌నగర్ తిరుమలనగర్, కృష్ణానగర్, లక్ష్మీనగర్, ఇందిరానగర్ కాలనీల్లో వీధుల్లో చెత్తను ప్రత్యేక వాహనాల ద్వారా తొలగింపజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పక్కన చెత్త వేయకుండా చెత్తఆటోల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, యూబీడీ సూపర్‌వైజర్ నరేశ్, సర్కిల్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ నవీన్‌రెడ్డి, అనిల్, పారిశుధ్య సిబ్బంది, జవాన్, పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

ఘట్ కేసర్, జూన్ 19: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్ కేసర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ది బేగం అనారోగ్యంతో కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందటంతో సీఎం సహాయానిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహకారంతో మంజూరైన రూ. 27వేల విలువైన చెక్కును గురువారం వారికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సోషల్ మీడియా సభ్యులు ఎండీ సిరాజ్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సమావేశంలో మాట్లాడుతున్న ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఎండీ నరేంద్రకుమార్

మియాపూర్,జూన్ 19: ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ మియాపూర్ బ్రాంచ్ ఖాతాదారుల సమావేశం గురువారం కార్యాలయంలో జరిగింది. సమావేశానికి సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు, డైరెక్టర్లు శీనయ్య, సోమలింగంగౌడ్, మేనేజింగ్ డైరెక్టర్ మన్నే నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండీ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. ఖాతాదారుల సహకారంతోనే సొసైటీ రూ. 4,450 కోట్లు లావాదేవీలతో, 1.10 లక్షల సభ్యులతో ఆరు రాష్ట్రాల్లో 42 శాఖలతో పనిచేస్తుందన్నారు. దేశంలోనే టాప్ 5 మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీల్లో ఒకటిగా కొనసాగుతూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ, మేనేజర్లు తాతాజీ, నరేంద్ర, సిబ్బంది సుమతి, గణేశ్, సుమంత్, మోహన్ పాల్గొన్నారు.

మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి బస్సులు నడపాలి

కుషాయిగూడ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన ఐద్వా మహిళలు

మల్కాజిగిరి, జూన్ 19: మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి బస్సులు నడపాలని మల్కాజిగిరి ఐద్వా మండల కమిటీ కార్యదర్శి పి.మంగ అన్నారు. గురువారం మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి సికింద్రాబాద్, ఈసీఐఎల్‌కు బస్సులు నడపాలని కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఐద్వా మహిళా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి పి.మంగ మాట్లాడుతూ మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి సికింద్రాబాద్‌కు ఈసీఐఎల్‌కు బస్సు సౌకర్యం చాలా తక్కువగా ఉందన్నారు. ఇక్కడ ప్రజలు సికింద్రాబాద్, ఈసీఐఎల్ పరిసర ప్రాం